# రాయితో దాడిచేసి.. వెంటాడి కత్తితో గొంతుకోశాడు

**నల్లగండ్లలో భార్యను హత్యచేసిన భర్త ✪ అనాథగా మారిన ఆరేళ్ల కూతురు**



రక్తపుమడుగుల్లో మృతురాలు అంబిక (ఇన్‌సెట్‌లో మృతురాలు)

సైబరాబాద్ జోన్ ప్రతినిధి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త : శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని నల్లగండ్లలలో పట్టపగలు ఓ మహిళ దారుణ హత్యకు గురైంది. ఈ విషాదకర సంఘటన చందానగర్ పోలీసు స్టేషన్ పరిధిలో జరిగింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వికారాబాద్ జిల్లా ఆలూరు గ్రామానికి చెందిన నరేందర్‌గౌడ్(27), నల్లగండ్లకు చెందిన అంబిక(26) ఇరువురూ తాండూరులో ఒకే పాఠశాలలో కలిసి చదువుకున్నారు. అప్పుడే వారిద్దరు ప్రేమించుకొని పెళ్లి చేసుకున్నారు. వీరికి ఓ పాప పుట్టిన తరువాత నరేందర్ తాగుడుకు బానిసై అంబికను, ఆమె కూతురిని సరిగ్గా చూసుకోకుండా, వేధించ సాగాడు. దీంతో అంబిక అతడిని వదిలేసి హైదరాబాద్ నగరానికి వచ్చి శేరిలింగంపల్లి సర్కిల్ పరిధిలోని నల్లగండ్లకు వచ్చి షాపులలో చిన్న చిన్న పనులు చేసుకుంటూ కూతురితో కలిసి జీవిస్తుంది. ఈ విషయం తెలుసుకున్న నరేందర్ అంబికకు ఫోన్ చేసి మళ్లీ కలిసి జీవిద్దాం రావాలని బెదిరించసాగాడు. దీంతో ఆమె భర్తతో కలిసి వెళ్లేందుకు నిరాకరించింది. నా మాటను లెక్క చేయడం లేదని పగ పెంచుకున్న నరేందర్ ఎలాగైనా తన భార్యను చంపాలని వెంట కత్తిని తీసుకొని నల్లగండ్లకు వచ్చాడు. కూతురితో కలిసి పనికి వెళ్తున్న ఆమెపై ఒక్కసారిగా రాయితో దాడి చేశాడు. ఆమె తప్పించుకొని పారిపోతుం డగా పట్టుకొని కత్తితో గొంతు కోశాడు. దీంతో ఆమె అక్కడి కక్కడే కుప్పకూలి చనిపోయింది. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహంను పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు. హంతకుడిని అదుపులోకి తీసుకొని కేసు నమోదు చేసుకున్నారు. తండ్రి చేసిన ఈ ఘాతు కానికి ఆరేళ్ల పసిపాప అనాథగా మారింది.



హంతకుడు నరేందర్‌గౌడ్



హైదరాబాద్ వార్త



బేగంపేటలో మొక్కను నాటుతున్న అంబేద్కర్ మనుమడు ప్రకాశ్ అంబేద్కర్, పక్కన ఎంపి జోగినపల్లి సంతోష్

## గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో మొక్కను నాటిన అంబేద్కర్ మనుమడు

బేగంపేట ఏప్రిల్ 14,ప్రభాతవార్త : రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రకాశ్ అంబేద్కర్ శుక్రవారం హైదరాబాద్ బేగంపేటలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో భాగంగా మొక్కను నాటారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ సృష్టికర్త రాజ్యసభ సభ్యుడు జోగిన పల్లి సంతోష్‌కుమార్, బీసీ సంక్షేమశాఖామంత్రి గంగుల కమలాకర్, ప్రభుత్వ విప్ బాల్కసుమన్‌తో కలిసి మొక్కను నాటారు. ఈ సందర్భంగా ప్రకాశ్ అంబేద్కర్ మాట్లాడుతూ తనను కలవాలి అనుకునే వారు తప్పని సరిగా మొక్కలు నాటాలని చెప్పిన మాతాత బీఆర్ అంబేద్కర్ స్ఫూర్తిని కొనసాగిస్తున్న జోగినపల్లి సంతోష్‌కుమార్ ఆశయం గొప్పదన్నారు. మనుషుల్లో సమానత్వం, ప్రకృతి సమతుల్యత కోసం పరితపించిన అంబేద్కర్ జయంతి రోజున మొక్కను నాటడం సంతోషంగా ఉందన్నారు. కేంద్ర న్యాయశాఖా మంత్రిగా ఉన్నప్పుడు తనను కలవాలి అనుకునే ప్రతి ఒక్కరూ ఒక మొక్కను నాటిన తరువాతనే తనను కలిసేందుకు రావాలని కోరుకున్నారని ఆయన ఈ సందర్భంగా గుర్తు చేసారు. మొక్కలు నాటడం పట్ల వారికి అమితమైన ఆసక్తి ఉండేదన్నారు. ఇన్ని సంవత్సరాల తరువాత మళ్లీ ఆ స్ఫూర్తిని గ్రీన్ ఇండియా ఛాలెంజ్‌లో చూస్తున్నానని ఆయన పేర్కొన్నారు. మంచి కార్యక్రమాన్ని నిర్విఘ్నంగా ముందుకు తీసుకు పోతున్న రాజ్యసభ సభ్యులు జోగినిపల్లి సంతోష్‌కుమార్ కృషి అనితర సాధ్యమైనదన్నారు. గ్రీన్ ఇండియా ఛాలెంజ్ లిమ్కా బుక్‌లో చేరడం ఆనందం కలిగించింది. వారి కృషికి మరింత గుర్తింపు రావాలి. ప్రకృతి పచ్చదనంతో పరిఢవిల్లాలని మనస్ఫూర్తిగా కోరుకుంటాన్నానని ప్రకాశ్ అంబేద్కర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రీన్ ఇండియా ఛాలెంజ్ ప్రతినిధి సంజీవరాఘవ తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని మాపక సిబ్బంది సేవలు అభినందనీయం

**మంత్రి తలసాని**



అగ్నిమాపక కేంద్రంలో నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో పాల్గొని ప్రసంగిస్తున్న మంత్రి తలసాని

బేగంపేట ఏప్రిల్ 14,ప్రభాతవార్త : అగ్ని ప్రమాదాలు సంభవించిన సమయంలో మంటలను అదుపు చేయడం, ఇతర ప్రకృతి వైపరీత్యాలు చోటు చేసుకున్న సమయంలో అగ్ని మాపక సిబ్బంది అందిస్తున్న సేవలు అభినందనీయమని రాష్ట్ర పశుసంవర్ధక, మత్స్య, పాడిపరిశ్రమల అభివృద్ధి, సినిమాటోగ్రఫీ శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. అగ్ని మాపక దళ వారోత్సవాల సందర్భంగా శుక్రవారం బేగంపేట లోని అగ్ని మాపక కేంద్రంలో నిర్వహించిన ప్రారంభ కార్యక్రమంలో మంత్రి శ్రీనివాస్‌యాదవ్ ముఖ్య అతిధిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రికి అగ్ని మాపక సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం అగ్ని ప్రమాదాల సమయంలో వినియోగించే యంత్ర సామాగ్రి పరికరాలను పరిశీలించారు. రక్తదాన శిభిరాన్ని ప్రారంబించారు. ముందుగా విధి నిర్వహణలో అశువులు బాసిన సిబ్బందికి మంత్రి ఇతర అధికారులు సిబ్బంది సంతాప సూచకంగా 2నిమిషాలు మౌనం పాటించి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ మహేశ్వరి రీజినల్ ఫైర్ ఆఫీసర్ పాపయ్య, జిల్లా ఫైర్ ఆఫీసర్ మధుసూధన్‌రావు, అదనపు జిల్లా ఫైర్ ఆఫీసర్ ధనుంజయరెడ్డి, సికింద్రాబాద్ ఫైర్ ఆఫీసర్ మోహన్‌రావు, బీఆర్‌ఎస్ నాయకులు శ్రీహరి, శ్రీనివాస్‌గౌడ్, శేఖర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.

**రాంగోపాల్‌పేట వెంగళరావునగర్‌లో..** అంటరాని తనం కుల నిర్మూలనే లక్ష్యంగా పోరాడిన మహానీయుడు డాక్టర్ బీఆర్ అంబేద్కర్ అని మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ మహేశ్వరి, మాజీ కార్పోరేటర్ అత్తెల్లి అరుణాగౌడ్, మల్లిఖార్జున్‌గౌడ్, బాలమల్లేష్ నర్సింగరావు, రాజు, గాలెయ్య, ఎల్లయ్య, సాయిలు యాకయ్య పాల్గొన్నారు.

## డ్రంక్ అండ్ డ్రైవ్‌లో దొరికిన అంబులెన్స్ డ్రైవర్.. కేసు నమోదు

కంటోన్మెంట్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త: మద్యం మత్తులో అంబులెన్స్ వాహనాన్ని సైరన్‌తో అతివేగంగా వెళ్తున్న అంబులెన్స్ డ్రైవర్‌పై మారేడ్‌పల్లి ట్రాఫిక్ పోలీసులు కేసు నమోదు చేశారు. ఇన్‌స్పెక్టర్ యాదేందర్ తెలిపిన వివరాల ప్రకారం.. బాలంరాయి చౌరస్తాలో ఈ నెల 13 గురువారం రాత్రి డ్రంక్ అండ్ డ్రైవ్ నిర్వహిస్తుండగా ఏపి 31టీడి 3527 అనే అంబులెన్స్‌ను జగద్గిరి గుట్ట ప్రాంతానికి చెందిన క్రిష్ణ ధరణి (25) పీకల దాఖ మద్యం సేవించి అంబులెన్స్‌లో రోగిని ఆసుపత్రికి తరలిస్తున్నట్లుగా సైరన్ వేసుకొని అతివేగంతో వెళ్తున్నాడు. ట్రాఫిక్ ఎస్‌ఐ రామ్‌చందర్ నాయక్ డ్రైవర్‌ను అదుపులోకి తీసుకొని బ్రీత్ అనలైజర్ టెస్ట్ చేయగా 280 ఎంజీ రావడంతో వాహనాన్ని సీజ్ చేసి డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నట్లు ఇన్‌స్పెక్టర్ యాదేందర్ తెలిపారు.

## మహిళలపై అత్యాచారయత్నం..

**మ్యూజీషియన్ అరెస్ట్**

హైదరాబాద్, మే 14, ప్రభాతవార్త: మహిళపై అత్యాచార యత్నానికి పాల్పడ్డన్న ఆరోపణలపై జూబ్లీహిల్స్ పోలీసులు ఓ మ్యూజీషియన్‌ను అరెస్ట్ చేశారు. అరెస్టయిన వ్యక్తి జూబ్లీహిల్స్‌కు చెందిన లలిత్ సెహగల్ (30)గా గుర్తించారు. అతను ఓ ప్రముఖ పబ్‌లో గిటారిస్ట్‌గా పనిచేస్తున్నాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. లలిత్ సెహగల్, ఓ మహిళ గతంలో స్నేహితులని తెలుస్తుంది. వారిద్దరి మధ్య దూరం పెరిగి నట్లు సమాచారం. ఈ నేపథ్యంలోనే లలిత్ సెహగల్ ఆ మహిళ ఇంట్లోకి చొరబడి లైంగిక దాడికి పాల్పడ్డాడు. అతడిని అడ్డుకున్న ఆమహిళ అక్కడి నుంచి తప్పించుకుని పోలీసులను ఆశ్రయించింది.

## బైక్ అదుపుతప్పి విద్యార్థి మృతి



ప్రణయ్(ఫైల్)

దుండిగల్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త : బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టిన ఘటనలో ఓ విద్యార్థి మృతి చెందగా మరో విద్యార్థి గాయాలపాలైన సంఘటన దుండిగల్ పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. కరీంనగర్‌లోని పద్మానగర్‌కు చెందిన మార్క నర్సయ్య పెద్ద కుమారుడు ప్రణయ్(20) దుండిగల్ పరిధిలోని ఓ ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ రెండవ సంవత్సరం చదువుతున్నాడు. కాగా గురువారం అర్థరాత్రి ప్రణయ్ అతని స్నేహితుడు అఖిల్‌లు బైక్(టిఎస్07ఈడబ్ల్యూ4893)పై గండిమైసమ్మ నుండి బహాదూర్‌పల్లి వైపు వెళ్తుండగా మార్గ మధ్యలోని హెచ్‌పి పెట్రోల్ బంక్ ఎదురుగా చేరుకోగానే బైక్ అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొట్టింది. ఈప్రమాదంలో ప్రణయ్ చాతి, తలకు బలమైన గాయాలవ్వగా అఖిల్ కాలు, చేతులకు గాయాలయ్యాయి. సమాచారం అందుకున్న పోలీసులు క్షతగాత్రులను సూరారంలోని వైద్యశాలకు తరలించగా పరీక్షించిన వైద్యులు ప్రణయ్ మృతిచెందినట్లు నిర్ధారించారు. అఖిల్ ప్రాణపాయం నుండి తప్పించుకున్నాడు. మృతుడి తండ్రి ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేపట్టారు.



## సాగరతీరం.. పూల వర్షం

**మారుమోగిన జైభీమ్ నినాదం**

### అట్టహాసంగా 125 అడుగుల అంబేద్కర్ విగ్రహావిష్కరణ

హైదరాబాద్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త : భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి వేడుకలతో నగరం పండుగ వాతావరణ తలపించింది. భాగ్యనగర నడిబొడ్డున హుస్సేన్‌సాగర్ తీరాన 125 అడుగుల ఎత్తులో ఏర్పాటు చేసిన డాక్టర్ బిఆర్ అంబేద్కర్ విగ్రహాన్ని ప్రకాశ్ అంబేద్కర్‌తో కలిసి సిఎం కెసిఆర్ ఆవిష్కరించారు. విగ్రహావిష్కరణ సందర్భంగా బౌద్ధ భిక్షువులు ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. ఈ సందర్భంగా అంబేద్కర్ విగ్రహంపై హెలికాప్టర్ ద్వారా గులాబీ పూల వర్షం కురిపించారు. అక్కడున్న ప్రజాప్రతినిధులంతా చప్పట్లతో పూల వర్షాన్ని స్వాగతించారు. అంబేద్కర్ విగ్రహ శిలాఫలకాన్ని ప్రకాశ్ అంబేద్కర్ ఆవిష్కరించారు. పంజాగుట్ట చౌరస్తాలో అంబేద్కర్ విగ్రహాన్ని మంత్రి కెటిఆర్ ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు మహమూద్ అలీ, కొప్పుల ఈశ్వర్, ఎర్రబెల్లి దయాకర్‌రావు, ఎమ్మెల్యే దానం నాగేందర్, మేయర్ గద్వాల విజయలక్ష్మీ తదితరులు పాల్గొన్నారు. ట్యాంక్‌బండ్ వద్దగల డాక్టర్ బి.ఆర్ ఆబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో మంత్రులు కొప్పుల ఈశ్వర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వైఎస్సార్‌టిపీ అధ్యక్షురాలు షర్మిల తదితరులు పాల్గొని ఘనంగా నివాళులర్పించారు.



వైశాకి పండగ సందర్భంగా అమీర్‌పేట్ గురుద్వార నుండి సిక్కులు నిర్వహించిన ఊరేగింపు

## అంబేద్కర్‌కు నివాళులర్పించిన ఒయూ వైస్ చాన్స్‌లర్



తార్నాక, ఏప్రిల్ 14 ప్రభాతవార్త: డా. బీఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఓ.యూ ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ సెల్ ఆద్వర్యంలో అంబేద్కర్ రీసెర్చ్ సెంటర్ ఆవరణలో ఘనంగా జరుపుకున్నారు. ఈ వేడుకలకు వైస్ చాన్స్‌లర్ ప్రొ.రవీందర్ యాదవ్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ కార్యక్రమంలో రిజిస్ట్రార్ ప్రొ.లక్ష్మినారాయణ, ప్రొ.మంగు, డా. చలమల వెంకటేశ్వర్లు, ప్రొ.సయ్యదా ఉస్సీసా, డా. కొండా నాగేశ్వర్‌రావు, డా. కొర్రెముల శ్రీనుతో పాటు పలువురు పాల్గొన్నారు.

## చలివేంద్రం ద్వారా ప్రయాణీకుల దాహార్తిని తీరుస్తున్నాము



ఖానాపూర్ బస్టాపు వద్ద కాంగ్రెస్ నేత పెద్దపులి కృష్ణ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన చలివేంద్రంను ప్రారంభిస్తున్న దృశ్యం

నార్సింగి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త : చలివేంద్రం ఏర్పాటు చేసి ఎండన పడి వస్తున్న ప్రయాణీకుల దాహార్తిని తీరుస్తున్నామని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నేత పెద్దపులి కృష్ణ(కిషన్) పేర్కొన్నారు. శుక్రవారం గండిపేట్ మండల పరిధిలోని ఖానాపూర్ బస్టాపు వద్ద ఏర్పాటు చేసిన చలివేంద్రంను మాజీ సర్పంచ్‌లు రామేశ్వరం నర్సిహ్మా, గండయ్య ముదిరాజ్, కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డిలతో కలిసి కృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎండ తీవ్రత రోజు రోజుకు అధికమవుతుందని, ప్రజలు అత్యవసరమైతేనే ఇళ్ల నుంచి బయటకు రావాలని సూచించారు. తప్పని సరి పరిస్థితుల్లో వివిధ పనులపై బయటకు వెళ్తున్న ప్రయాణీకులకు చల్లటి మంచినీరు అందిస్తే అదే ఆ సమయంలో వారికి అమృతంలా అనిపస్తుందన్నారు. ప్రజలకు చల్లటి నీటిని తాగించే అవకాశం నాకు దక్కడం నా అదృష్టమన్నారు. వేసవి ముగిసేంత వరకు ఇక్కడ చల్లటి మంచినీరు అందిస్తూనే ఉంటామని కృష్ణ స్పష్టం చేశారు.

### గాంధీనగర్‌లో అంబేద్కర్ జయంతి

**చిక్కడపల్లి..** భారతరత్న బిఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా గాంధీనగర్ డివిజన్ కార్పొరేటర్ కార్యాలయం, నేతాజీనగర్, అరుంధతినగర్, అన్నానగర్ బస్తీ, ఎల్ఐసి బ్రిడ్జ్ చౌరస్తాలో బిజెపి దళితమోర్చ, బస్తీల సంఘాల ఆధ్వర్యంలో స్థానిక కార్పొరేటర్ ఎ.పావనీ వినయకుమార్, బిజెపి నగర నేత ఎ.వినయకుమార్ హాజరై శుక్రవారం ఘనంగా నివాళులు అర్పించి ప్రసంగించారు. కార్యక్రమంలో బిజెపి డివిజన్ అధ్యక్షుడు రత్నాసాయిచంద్, యాదగిరిగౌడ్, శ్రీకాంత్, ఉమేశ్, మహూద్, సత్తిరెడ్డి, నవీన్‌కుమార్, రాజేందర్, లక్ష్మణ్‌యాదవ్, శివకుమార్, సాయికుమార్, ఆనంద్‌రావు, సత్యేందర్, చిర్ర యాదగిరి, సంతోష్, హన్మంత్, సురేశ్, ప్రశాంత్, దేవిడ్, సతీష్ తదితరులు పాల్గొన్నారు.

## అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా ప్రభుత్వం కృషి

**డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి**



మాట్లాడుతున్న డిప్యూటి మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి

తార్నాక, ఏప్రిల్ 14 ప్రభాతవార్త: అంబేద్కర్ ఆశయాలకు అనుగుణంగా రాష్ట్ర ప్రభుత్వం పలు సంక్షేమ కార్యక్రమాలను చేపడుతుందనిన నగర డిప్యూటీ మేయర్ శ్రీలత శోభన్‌రెడ్డి పేర్కొన్నారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని తార్నాక డివిజన్‌లోని ఆయా ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన వేడుకల్లో బీఆర్‌ఎస్ కార్మిక విభాగం అధ్యక్షులు మోతె శోభన్‌రెడ్డితో కలిసి డిప్యూటీ మేయర్ పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళ్లర్పించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ట్యాంక్ బండ్ సమీపంలో దేశంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహాన్ని ఏర్పాటు చేసిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కిందన్నారు. మాణికేశ్వరీనగర్ బస్తీలో ఏర్పాటు చేసిన వేడుకల్లో టీఆర్‌ఎస్ సీనియర్ నాయకులు ఆలకుంట హరి, ఒయూ ఎస్సీ, ఎస్టీ నాన్ టీచింగ్ ఎంప్లాయిస్ అసోసియేషన్ అధ్యక్షుడు బొయ కుమార్, అంబేద్కర్ యువజన సేవా సంఘం నాయకులు గోల్కొండ వెంకటేష్, స్టాలిన్, ఇరుగు జగదీష్, సునిల్ ముదిరాజ్, నాగుతో పాటు పలువురు పాల్గొన్నారు.

### అంబేద్కర్ ఆశయాలు అమలకు బిజెపి కృషి



అంబేద్కర్ విగ్రహానికి అంజలి ఘటిస్తున్న మహా లక్ష్మీరామన్‌గౌడ్

హైదరాబాద్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త:భారత రత్న, రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకుని హిమాయత్‌నగర్ డివిజన్‌లోని పలు ప్రాంతాలలో ఆయన విగ్రహాలకు కార్పోరేటర్ జి.మహాలక్ష్మీరామన్‌గౌడ్ పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. బగ్గీఖానా, రాజమహాల్లా, ముత్యాల్‌బాగ్ తదితర ప్రాంతాలలోని అంబేద్కర్ విగ్రహాలకు, పలు చోట్ల చిత్రపటాలకు అంజలి ఘటించారు. ఈ కార్యక్రమంలో బిజెపి నాయకులు రామన్‌గౌడ్, అరుణ్‌కుమార్, నర్సింగ్‌గౌడ్, వెంకటేష్, మల్లేష్, నారాయణ, లాల్, జాకీ, కొండయ్య, వీరునాయక్, వేణుగోపాల్‌యాదవ్, సందీప్, సాయి, ప్రవీణ్, రాజు, సుజాత, శారదా, పనూజ, పద్మజ, దేవి పాల్గొన్నారు.

## దేశం గర్వించేలా అంబేద్కర్ విగ్రహావిష్కరణ

**దక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ వేదకుమార్**

హైదరాబాద్, ఏప్రిల్ 14,ప్రభాతవార్త : నాడు బడుగు బలహీనవర్గాల అభ్యున్నతి, అభివృద్ధి, సమానత్వం సమసమాజ నిర్మాణమే ఆశయంగా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ ప్రపంచానికి ఆదర్శవంతమైన రాజ్యాంగాన్ని రచించారని, నేడు సమస్త వర్గాల అభివృద్ధికోసం సిఎం కెసిఆర్ నాయకత్వంలోని తెలంగాణ ప్రభుత్వం అంబేద్కర్ గొప్పదనాన్ని దేశమంతా కొనియాడేలా విగ్రహాన్ని నిర్మించి ఆవిష్కరించడం మంచిపరిణామమని దక్కన్ హెరిటేజ్ అకాడమీ చైర్మన్ మణికొండ వేదకుమార్ అన్నారు. ఈమేరకు శుక్రవారం ట్యాంక్‌బండ్‌పైగల అంబేద్కర్ విగ్రహానికి సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్, గ్రంథాలయ పరిషత్ చైర్మన్ ఆయచితం శ్రీధర్ తదితరులతో కలిసి పూలమాల వేసి నివాళ్లు అర్పించారు. ఈసందర్భంగా వేదకుమార్ మాట్లాడుతూ యావత్ దేశం ముఖ్యంగా తెలుగు జాతి గర్వపడేలా హైదరాబాద్ నడిబొడ్డున 125 అడుగుల అబేద్కర్ విగ్రహాన్ని నిర్మించి ఆయన మనువడు ప్రకాశ్ అంబేద్కర్ చేతుల మీదుగా ఆవిష్కరించడం అలాగే నూతన సచివాలయానికి సైతం అంబేద్కర్ భవనంగా నామకరణం చేసి ఆయనకీర్తిని మరింత ఇనుమడింపజేశారని సిఎం కెసిఆర్‌ను ప్రశంసించారు. జూలూరి గౌరీశంకర్ మాట్లాడుతూ ఆంబేద్కర్ వేసిన అడుగుల సమసమాజ నిర్మాణమే విప్లవానికి పునాదులు వేస్తాయని ఆయన అశయమైన సామాజిక న్యాయం నినాదం తెలంగాణ నుంచే మొదలైందని తెలిపారు. ఆయచితం శ్రీధర్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశయాలు ఒక్క తెలంగాణకే కాదు యావత్ దేశానికే గర్వకారణమని ఆయన అడుగుజాడల్లో దేశం మొత్తం నడవాలని పిలుపునిచ్చారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద మాట్లాడుతున్న వేదకుమార్, గౌరీశంకర్, ఆయచితం శ్రీధర్ తదితరులు

## 15న దొడ్డి కొమురయ్య వర్థంతి



సమావేశంలో మాట్లాడుతున్న దొడ్డి నరహరి. చిత్రంలో కుమార్తె, అల్లుళ్ళు తదితరులు

సైఫాబాద్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త: ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు దొడ్డి కొమురయ్య వర్థంతిని పురస్కరించుకుని ఈ నెల 15వ తేదీన సిద్దిపేట జిల్లా చేర్యాల పట్టణంలో కొమురయ్య శిలాఫలకం వద్ద పలు సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నామని ఆయన కుటుంబ సభ్యులు తెలిపారు. ఈ మేరకు శుక్రవారం ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో కొమురయ్య కుమారుడు దొడ్డి కొమురయ్య సేవా సమితి చైర్మన్ దొడ్డి నరహరి, కుమార్తె సుద్దాల పద్మ, అలుళ్ళు వెంకటస్వామి, శ్రీనివాస్, ఏడుకొండలు తదితరులు మాట్లాడుతూ నేతాజీ సుభాష్‌చంద్రబోస్‌తో కలిసి కొమురయ్య స్వాతంత్ర్య పోరాటంలో పాల్గొని ప్రాణాలకు తెగించి పోరాటం చేశారని, ఆ క్రమంలో బుల్లెట్, రైఫిల్ దెబ్బలకు గురై జైలు జీవితాన్ని అనుభవించారని గుర్తు చేశారు. పది భాషాల్లో ప్రావీణ్యం సంపాదించిన ఆయన తీహార్, ముంబాయి, సికింద్రాబాద్ జైళ్లలో శిక్ష అనుభవించారన్నారు. చివరివరకు ఆయన దేశ ప్రజలకు ఉచితంగా వైద్య సేవలు అందిస్తూ మల్కాజ్‌గిరిలో ఏప్రిల్ 15న తుది శ్వాస విడిచారని వారు ఆందోళన వ్యక్తం చేశారు. 15న సిద్దిపేటలో విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు పంపిణి, అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు మెమోంటోలు, పేదలకు అన్నదానం పెద్ద ఎత్తున నిర్వహిస్తున్నాయని ఈ కార్యక్రమాల్లో యువకులు, విద్యార్థులు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు.






అంబద్కేర్ జయంతి ఉత్సవాలలో పాల్గొన్న ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్ తదితరులు, తుకారాంగేట్‌లో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న కార్పోరేటర్ లింగాని ప్రసన్న, మాజీ మేయర్ బండ కార్తీక రెడ్డి తదితరులు, నివాళులు అర్పిస్తున్న బాలగౌని బాలరాజ్‌గౌడ్, అయిలి వెంకన్నగౌడ్,

# శివార్లలో మహిళా రియల్టర్‌పై హత్యాయత్నం

సరూర్‌నగర్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త: హైదరాబాద్ శివార్లలో ఓ మహిళా రియల్ ఎస్టేట్ వ్యాపారిపై హత్యా యత్నం జరిగింది. ప్లాటు విక్రయించగా వచ్చిన కమీషన్ విషయంలో భాగస్వామితో వచ్చిన విభేదాలు దాడికి దారి తీసాయి. గ్రానైట్ రాయి, ఇనుప రాడ్‌తో జరిగిన దాడిలో బాధితురాలి తలకు తీవ్ర గాయమైంది. ఈ సంఘటన మీర్‌పేట్ పోలీస్ స్టేషన్ పరిధిలోని బడంగ్‌పేట్‌లో జరిగింది. ఇన్స్‌పెక్టర్ మద్ది మహేందర్‌రెడ్డి కథనం ప్రకా రం ఈ ఘటనకు సంబంధించిన వివరాలిలా ఉన్నాయి. బడంగ్‌పేట్‌లోని వసంతవిహార్ కాలనీకి చెందిన జౌన రాధిక (41) అనే మహిళ రియల్ ఎస్టేట్ వ్యాపారం చేస్తుంటారు. గత కొన్ని సంవత్సరాల నుండి ఆమె కొము రయ్య యాదవ్ అనే వ్యక్తితో కలిసి రియల్ ఎస్టేట్ వ్యాపారం నిర్వహిస్తున్నారు. గతంలో వీరిద్దరి మధ్య సమస్య రావడంతో పెద్దల సమక్షంలో జరి గిన పంచా యతీతో సమసిపోయింది. ఆ తర్వాత వీరిద్దరు కలిసి నాదర్‌గుల్ ఎంవిఎస్ఆర్ కాలేజీ వెనుక ప్రాంతంలో ఒక ప్లాటును కొనుగోలు చేశారు. తర్వాత విక్రయించగా కమీ షన్ల విషయమై వివాదం జరిగింది. రూ.10 లక్షల అదనపు కమీషన్ కావాలని కొమురయ్య చేసిన డిమాండ్ వివాదానికి దారి తీసింది. ఈ క్రమంలో శుక్రవారం బడంగ్‌పేట్‌లోని కొమురయ్య రియల్ ఎస్టేట్ ఆఫీస్‌కు తన కుమారుడు భరత్‌తో వచ్చిన రాధికతో గొడవ తీవ్రం అయ్యింది. దీంతో ఇంటి నుండి ప్రామిసరీ నోటు తీసుకురావాలని ఆమె కుమారుడిని బయటకు పంపింది. ఇంతలో వివాదం ముదిరి కొమురయ్య గ్రానైట్ రాయి, ఇనుప రాడ్‌తో రాధికపై దాడి చేశాడు. తల్లి అరుపులు విన్న భరత్ అడ్డుకోవాలని ప్రయత్నించినా ఫలితం లేకపోయింది.

దీంతో తీవ్ర గాయాల పాలైన రాధికను ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించి మీర్‌పేట్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కొమురయ్యపై పోలీసులు సెక్షన్ 307, 342 సెక్షన్ల కింద కేసును నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.





అంబేద్కర్ చిత్రపటానికి నివాళులు అర్పిస్తున్న బీఆర్ఎస్ నాయకులు, అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్, వెంటాపురం చౌరస్తా వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న నాయకులు

# అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి

**సికింద్రాబాద్..** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబే ద్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని సీతాఫల్‌మండి చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఆటో యూనియన్ ఆధ్వర్యంలో ఉత్స వాలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతి థిగా రాష్ట్ర సహాయ కార్యదర్శి జ్రిపోతుల కుమార్, ఏఐటీ యూసీ ఆటో యూనియర్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎండి ఉమర్ ఖాన్‌లు విచ్చే సి అంబేద్కర్ విగ్ర హానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అంబేద్కర్ ఆశయ సాధన కోసం నిరంతరం శ్రమిస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కొమురెల్లి బాబు, ఎస్కె లతీష్, కుమార్, శ్రీను, నరసయ్య పాల్గొన్నారు.

**అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఆటో యూనియన్ నేతలు**

**ఖైరతాబాద్..** భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్.అం బేద్కర్ 132వ జయంతి వేడుకలను అభిమాన నాయకులు, వివిధ రాజ కీయ నాయకులు అత్యంత ఘనంగా జరుపుకు న్నారు. బస్తీల, కాల నీలు, పలు ప్రధాన చౌరస్తాలలో అంబేద్కర్ జయంతి వేడుకలను అంగరంగ వైభవోపేతంగా నిర్వహించారు. ఎమ్మెల్యే దానం నాగేం దర్, టి.పిసిసి ప్రధాన కార్యదర్శి, కార్పొరేటర్ పి.విజయారెడ్డి వేడుకల్లో పాల్గొన్నారు. అన్ని ప్రాంతాలలో అంబేద్కర్ వేడుకలను అభిమానులు ఘనంగా జరుపుకున్నారు.

**కూకట్‌పల్లిలో ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు**

**కూకట్‌పల్లి..** అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని కూకట్‌పల్లి నియోజకవర్గం పరిధిలోని పలు ప్రాంతాలలో శుక్రవారం జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. కెపిహెచ్‌బి కాలనీ 4వ ఫేస్‌లో గల అంబేద్కర్ విగ్రహం దగ్గర దళితరత్న బాబ్జీ కుమార్ ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ముఖ్య అతిథిగా కార్పోరేటర్ మందడి శ్రీనివాసరావు పాల్గొని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో కృష్ణారెడ్డి, కోదండ రామయ్య, శేఖర్‌రెడ్డి, రాజేష పెద్దిరాజు, శామ్యుల్, సాంబ, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

**బి.ఆర్.అంబేద్కర్ జీవితం ప్రతీ ఒక్కరికీ ఆదర్శం : యుగంధర్‌రెడ్డి**

భారతరత్న భారత రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్.అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా కూకట్‌పల్లి నియోజకవర్గంలోని బాలానగర్ డివిజన్ రాజు కాలనీ కమాన్ వద్ద గల అంబేద్కర్ కాంస్య విగ్రహానికి కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఏ బ్లాక్ ఉపాధ్యక్షుడు మాదిరెడ్డి యుగంధర్‌రెడ్డి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ దళిత సంక్షేమ సంఘం అధ్యక్షుడు ఆదిముళ్ల రాము, చీఫ్ అడ్వైజర్ నల్ల విల్సన్, సంఘం సభ్యులు ఎస్‌బిఐ లక్ష్మణ్, అశోక్, శంకర్ తదితరులు పాల్గొన్నారు.

**అంబేద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలి : లింగాని ప్రసన్న, బండ కార్తీక**

**అడ్డగుట్ట..** భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబే ద్కర్ ఆశయాలను స్ఫూర్తిగా తీసుకోవాలని అడ్డగుట్ట డివిజన్ కార్పోరేటర్ లింగాని ప్రసన్న శ్రీనివాస్,గ్రేటర్ మాజీ తొలి మేయర్ బండ కార్తీకరెడ్డిలు పిలుపునిచ్చారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని తుకారాంగేట్‌లోని అంబేద్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన జయంతి వేడుకలకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు.

**అంబేద్కర్ చేసిన సేవలు మరువలేనివి : మర్రి రాజశేఖర్ రెడ్డి**

**కంటోన్మెంట్..** రాజ్యాంగ రూపకర్తగా, న్యాయవాదిగా శాస్త్ర వేత్తగా సంఘ సంస్కర్తగా సేవ చేసిన మహనీయుడు బాబా సాహెబ్ అంబేద్కర్ అని మల్కాజిగిరి పార్లమెంట్ బిఆర్ఎస్ ఇన్‌ఛార్జి మర్రి రాజశేఖర్ రెడ్డి తెలిపారు. అంబేద్కర్ 132వ జయంతిని పురస్కరించుకొని కంటోన్మెంట్ నియోజకవర్గం లోని 1,3,4,5,6 వార్డులు, 150వ డివిజన్ రైల్ నిలయం అంబేద్కర్‌లోని వివిధ ప్రాంతాల్లో ఏర్పాటు చేసిన జయంతి వేడుకల్లో ఆయన పాల్గొని అంబేద్కర్‌కు నివాళులర్పించారు. ఆయన దేశానికి చేసిన సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షులు జక్కుల మహేశ్వర్ రెడ్డి, మాజీ బోర్డు సభ్యులు పాండు యాదవ్, నళిని కిరణ్,ప్రభాకర్, బిఆర్ఎస్ నాయకులు ముప్పిడి మధుకర్, ప్రవీణ్ యాదవ్, రాజు సింగ్, సదానంద్ గౌడ్, పరుశరామ్ తదితరులు పాల్గొన్నారు.

**మారేడ్‌పల్లి 2 బి హెచ్ కెలో ఘనంగా అంబేద్కర్ జయంతి**

అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని మారేడ్‌పల్లి జైభీమ్ ఎస్సీ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో 2 బిహెచ్‌కె హౌజింగ్ కాలనీలో ఏర్పాటు చేసినన అంబేద్కర్ జయంతి వేడుకలకు మారేడ్‌పల్లి సబ్ ఇన్స్‌పెక్టర్ రవికుమార్ పాల్గొని అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ఎస్ఐ రవి ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో బస్తీ పెద్దలు ఈశ్వర్, ప్రసాద్, చిటీ ట్టు, శిరీస్, సునీల్, జగ్గం మహేశ్,రాజు సంతోష్‌లతో పాటు కమిటీ ప్రతినిధులు పాల్గొన్నారు.

**ఘనంగా డాక్టర్ బిఆర్ ఆంబేద్కర్ జయంతి**

**అల్వాల్..** అల్వాల్‌లో భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలు వాడ వాడలా ఘనంగా జరిగాయి. మల్కాజిగిరి ఎమ్మెల్యే మైనంపల్లి హనుమంతరావు వెంటాపురం చౌరస్తా వద్ద గల అంబేద్కర్ విగ్రహానికి స్థానిక కార్పొరేటర్ సబిత అనీల్ కిషోర్‌తో కలిసి పూలమాలలు వేశారు. మచ్చబొల్లారం డివిజన్ పరిధిలోని తుర్కపల్లి కౌకూర్ బర్టన్‌గూడ తదితర ప్రాంతాల్లో స్థానిక కార్పొరేటర్ జితేందర్ నాథ్ జయంతి ఉత్సవాల్లో పాల్గొన్నారు. మచ్చబొల్లారంలో బిజెపి జిల్లా ఓబిసి ప్రచార కార్యదర్శి దండుగుల వెంకటేష్ రాజ్యాంగ నిర్మాతకు పూలమాలలు వేశారు.

**తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయకమిటీచే అంబేద్కర్ జయంతి వేడుకలు**

**చిక్కడపల్లి..** తెలంగాణ గౌడ కల్లుగీత సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆ మహనీయుడి విగ్రహానికి శుక్రవారం కమిటీ చైర్మన్ బాలగౌని బాలరాజ్‌గౌడ్, కన్వీనర్ అయిలి వెంకన్నగౌడ్, వర్కింగ్‌ప్రెసిడెంట్ యెలికట్టే విజయకుమార్‌గౌడ్ తదితరులు ఘనంగా నివాళులు అర్పించి ప్రసంగించారు. సమాజంలో అసమానతలను రూపుమాపి అణగారినవర్గాల ఆత్మగౌరవంను ఎలిగెత్తి చాటిన మహనీయుడు అంబేద్కర్ అని కీర్తించారు. అంబేద్కర్ ఆశయాలను భవిష్యత్తు తరాలకు ముందుకు తీసుకుపోవడానికి ముందుంటామన్నారు.

**బాగ్‌లింగంపల్లిలో అంబేద్కర్ జయంతి సందర్భంగా అన్నదానం**

**చిక్కడపల్లి..** అంబేద్కర్ ఉత్స వ సమితి చైర్మన్ గోపి, వైస్‌చైర్మ న్ కిరణ్‌కుమార్ ఆధ్వర్యంలో భారతరత్న బిఆర్.అంబేద్కర్ జయంతి కార్యక్రమం సందర్భంగా బాగ్‌లింగంపల్లిలో ఏర్పాటు చేసిన అన్నదాన కార్యదర్శి బిజెవైఎం పూర్వ రాష్ట్ర అధ్యక్షుడు జి.భరత్‌గౌడ్, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్ తనయుడు కోవా రాహుల్ హాజరై ప్రారంభించి ప్రసంగించారు. కార్యక్ర మంలో బిజెపి నేతలు సోమ సతీష్, ఉపేందర్, భరత్ భూషణ్, రఘువీర్, వాసు, రామ్ రాథోడ్, రవిరాథోడ్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

**బాపునగర్‌లో అంబేద్కర్ జయంతి వేడుకలు**

**పేట్‌బషీరాబాద్..** డా.బి.ఆర్. అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజక వర్గం పరిధి బాపునగర్ కమ్యూనిటీ హాల్లో నిర్వహించిన అంబేద్కర్ జయంతి ఉత్సవాలకు బీఆర్ఎస్ యూత్ అధ్యక్షుడు దూదిమెట్ల సోమేష్‌యాదవ్ ముఖ్య అతిథిగా హాజరై నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా సోమేష్‌యాదవ్ మాట్లాడుతూ దేశంలోనే అతిపెద్ద అంబేద్కర్ విగ్రహన్ని ఆయన జయంతి సందర్భంగా సీఎం కేసీఆర్ ఆవిష్కరించడం ఎంతో గర్వకారణం అన్నారు. ఈ కార్యక్రమంలో కాలనీ అధ్యక్షుడు జగదీష్‌గౌడ్, పెంటయ్య ముదిరాజ్, కృష్ణయాదవ్, బాబురావు, సుధాకర్‌రెడ్డి పోచయ్య, సురేందర్, బెనర్జీ, మధు, రాజారెడ్డి, ప్రవీణ్, వెంకటేష్, సుబ్బయ్య, సత్యనారాయణ, తదితరులు పాల్గొన్నారు.

**అంబేద్కర్ ఆశయాల సాధనకు ప్రతి ఒక్కరు కృషి చేయాలి**

**కొంపల్లి..** కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కొంపల్లి మున్సిపల్ కార్యాలయంలో శుక్రవారం డా.బి.ఆర్. అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి మున్సిపల్ చైర్మన్ సన్న శ్రీశైలంయాదవ్ నివాళులు అర్పించారు. అనంతరం కొంపల్లి, దూలపల్లిలోని ప్రాంతాలలో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకలకు ముఖ్య అతిథిగా హాజరై నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా శ్రీశైలంయాదవ్ మాట్లాడుతూ అంబేద్కర్ ఆశ యాలను సాధించడానికి ప్రతి ఒక్కరు కృషి చేయాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో వైస్‌చైర్మన్ గంగయ్య నాయక్, కమిషనర్ శ్రీహరి, డీఈ చిరంజీవులు, మేనేజర్ శ్రీనివాస్‌గౌడ్, కౌన్సిలర్లు, బీఆర్ఎస్ పార్టీ శ్రేణులు, సిబ్బంది పాల్గొన్నారు.

**నిజాంపేట్‌లో అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న మేయర్**

**నిజాంపేట్..** భారత రాజ్యాంగ నిర్మాత భారతర్నత డా.బి. ఆర్.అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా కుత్బుల్లాపూర్ నియోజకవర్గం నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధి ప్రగతినగర్‌లో నిర్వహించిన అంబేద్కర్ జయంతి వేడుకలకు శుక్రవారం మేయర్ కొలన్ నీలాగోపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ ధన్‌రాజ్‌యాదవ్, కమిషనర్ కృష్ణారావు, ఫ్లోర్ లీడర్ ఆగం పాండు ముదిరాజ్, కార్పొరేటర్లు, బీఆర్ఎస్ నాయకులు, ఎన్ఎంసీ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



రైల్ నిలయం అంబేద్కర్ నగర్‌లో అంబేద్కర్‌కు నివాళులర్పిస్తున్న మర్రిరాజశేఖర్ రెడ్డి తదితరులు



మయూరి మార్గ్‌లో అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసిన ఎమ్మెల్యే మాధవరం




అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్ననిజాంపేట మేయర్ కొలన్ నీలాగోపాల్ రెడ్డి

**అంబేద్కర్ సేవలు ఎన్నటికీ మరువలేం...ఎమ్మెల్యే మాధవరం.**

**బేగంపేట..** అంబేద్కర్ 132వ జయంతి సందర్భంగా బేగంపేట డివిజన్ మయూరి మార్గ్,తాతాచారి కాలనీ లో ఆయన అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు మాట్లాడుతూ ఈ రోజు భారత దేశంలో ప్రతి పౌరుడు ఇంత స్వేచ్ఛగా జీవిస్తున్నారన్నా,గౌరవ ప్రదమై న పదవులు మేము పొందామంటే అది కేవలం అంబేద్కర్ రాసిన రాజ్యాంగం వల్లనేని దేశానికి ఆయన చేసిన సేవలను ఎన్నటికీ మర్చిపోలేమని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో కార్పోరేటర్ మహేశ్వరి,శ్రీహరి,డివిజన్ అధ్యక్షు లు పొన్న బోయిన సురేష్‌యాదవ్.నాగు రఘునాథ్, రాజ లింగం,పవన్,నరేష్,మాణిక్,తదితరులు పాల్గొన్నారు.

**రాజేంద్రనగర్‌లో అంబేద్కర్ జయంతి ఉత్సవాలు**

**మైలార్‌దేవ్‌పల్లి..** దేశం గర్వించదగ్గ మేధావుల్లో అంబేద్కర్ మహోన్నతుడని తెలంగాణ రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి,రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాష్ గౌడ్‌లు కొనియాడారు.డాక్టర్.బి.ఆర్. అంబేద్కర్, డాక్టర్ బాబు జగ్జీవన్‌రామ్ రాజేంద్రనగర్ సర్కిల్ జయంతి ఉత్సవాల కమిటి అధ్యక్షులు పలుగు చెరువు మహేష్ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి పి.సబితా ఇంద్రారెడ్డి,ఎంపి.డాక్టర్. రంజిత్ రెడ్డి,ఎమ్మెల్యే ప్రకాష్ గౌడ్‌తో పాటు పలువురు ప్రముఖులు పాల్గొని డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ కార్యక్రమంలో శాసన మండలి మాజీ చైర్మన్ కె.స్వామిగౌడ్,ఎసిపి గంగాధర్,టిడిపి రాష్ట్ర ఉపాధ్యక్షులు సామ భూపాల్ రెడ్డి,ఆర్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు మంద కృష్ణ మాదిగ,హైదరాబాద్ టిఎన్జీఓ అధ్య క్షులు ముజీబ్,జయంతి ఉత్సవాల కమిటి అధ్యక్షులు పలుగు చెరువు శ్రీనివాస్, ప్రధాన కార్యదర్శి బి.టి.శ్రీనివాస్, కోశాధికారి మంగళూరు శ్రీనివాస్,ముఖ్య సలహాదారులు వనం నర్సింహా మాదిగతో పాటు పలువురు పాల్గొన్నారు.

**ఎస్సీ, ఎస్టీ చట్టం నుంచి బిసిలకు మినహాయింపు ఇవ్వాలి**

**బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ డిమాండ్**

సైఫాబాద్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త:ఎస్సీ, ఎస్టీ (అత్యాచార నిరోధక) చట్టం నుంచి బిసిలకు మినహాయింపు ఇవ్వాలని లేని పక్షంలో బిసిలకు కూడా ప్రత్యేకంగా రక్షణ చట్టాన్ని రూపొందించాలని తెలంగాణ బిసి సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు ఎర్ర సత్యనారాయణ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలను డిమాండ్ చేశారు. రాజ్యాంగంలో రూపొందించిన ఆర్టికల్ 340 స్ఫూర్తికి ఈ సవరణ అవసరమని విశ్లేషించడం జరిగిందన్నారు. ఈ మేరకు శుక్రవారం బిసి భవన్‌లో జరిగిన అంబేద్కర్ జయంతి వేడుకల్లో ఆయన మాట్లాడారు. రాజ్యాంగానికి ముందు బిసి, ఎస్సీ, ఎస్టీలు వంచిత వివక్ష దోపిడి పీడిత వర్గాలుగా ఏకస్థాయి గుర్తింపు ఉండేదని, ఈ పీడిత వర్గాలను అణిచివేత వివక్ష వర్గ సారూప్యతతో గుర్తించి ఓబిసి, ఎస్సీ, ఎస్టీలుగా క్రమబద్ధీకరించి వీరందరిని సమస్థా యిలో అభివృద్ధి చేసి సోషలిజం అనే ప్రధాన రాజ్యాంగ లక్ష్యానికి చేరుకోవడానికి అన్ని రంగాలలో జనాభ దామాషా ప్రకారం రిజర్వేషన్ లు తదితర సౌకర్యాలు కల్పించే ఆర్టికల్ 340 (ఓబిసి), 341 (ఎస్సీ) 342 (ఎస్టీ) లను రూపొందించడం జరిగిందని ఆయన వివరించారు.

**అంబేద్కర్ సాహిత్యం, సిద్ధాంతాలు ప్రపంచ మానవాళి అంతటికీ స్ఫూర్తి**

**రాష్ట్ర సమాచర కమిషన్ విశ్రాంత చీఫ్ కమిషనర్ బుద్ధ మురళీ**

చిక్కడపల్లి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త: అంబేద్కర్ సాహిత్యం, సిద్ధాం తాలు కేవలం ఒక దేశం, వర్గం ప్రజలకు పరిమితం కాదని, ప్రపంచ మానవాళి అంతటికీ స్ఫూర్తి అని రాష్ట్ర సమాచర కమిషన్ విశ్రాంత చీఫ్ కమిషనర్ బుద్ధ మురళీ అన్నారు. శ్రీ త్యాగరాయ గానసభలోని కళాసుబ్బారావు కళావేదికలో గానసభ నిర్వహణలో అధ్యక్షుడు కళావిఎస్.జనార్ధనమూర్తి అధ్యక్షతన శతాబ్ది పూర్వ మహనీయుల యాదిలో కార్యక్రమంలో భాగంగా భారతరత్న డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంతి సభ జరిగింది. ముఖ్యఅతిథిగా హాజరైన బుద్ధ మురళీ మాట్లా డుతూ అంబేద్కర్ రాజ్యాంగంలో చిన్న రాష్ట్రాలు అవసరమైనవని గుర్తించిన నేపథ్యంలోనే తెలంగాణ రాష్ట్రం ఏర్పడిందని, దానికి గుర్తుగా రాష్ట్ర సచివాలయానికి ఆ మహనీయుడి పేరు సిఎం కెసిఆర్ పెట్టార న్నారు. ఈ కార్యక్రమంలో వికలాంగున జాతీయ నాయకుడు కొల్లి నాగే శ్వరరావు, విశ్వకళామండలి జాతీయ అధ్యక్షుడు, మూలవాసి ఉద్యమకవి మాస్టర్జీ తదితరులు పాల్గొన్నారు.

**ట్యాంక్‌బండ్ వద్ద అంబేద్కర్ జయంతి**

సైఫాబాద్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త: రాజ్యాంగ నిర్మాత డా.బి.ఆర్. అంబేద్కర్ 132వ జయంతి వేడుకలు శుక్రవారం ట్యాంక్‌బండ్ వద్దగల ఆయన విగ్రహం ఎదుట ఘనంగా జరిగాయి. ఆనేక మంది ప్రజా ప్రతినిధులు, వివిధ దళిత, కుల, ప్రజా సంఘాల నేతలు, అంబేద్కరిస్టులు వేలాది మంది పాల్గొని ఆయన విగ్రహానికి ఘనంగా నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా రాష్ట్ర మంత్రులు మంత్రి కొప్పుల ఈశ్వర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిలా, మాజీ మంత్రి మోత్కుపల్లి నర్సింహులు, ఎంఆర్‌పిఎస్ అధ్యక్షుడు మంద కృష్ణమాదిగ, మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు జి.చెన్నయ్య, ఆర్‌పిఐ తెలుగు రాష్ట్రాల కో-ఆర్డినేటర్ టి.పద్మారావు, డా.బాబూ జగ్జీవన్‌రామ్, డా.బి.ఆర్. అంబేద్కర్ జయంతి ఉత్సవాల కమిటి వర్కింగ్ చైర్మన్‌లు మేడి పాప య్యమాదిగ, జంగా శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సంగీతం రాజలింగం, తూర్పాటి హనుమంతు, దళిత సంక్షేమ సంఘం నాయకుడు బుదాల బాబురావు, దళిత బహుజన పార్టీ రాష్ట్ర నాయకులు సిల్వేరి వసంత రావు, ఇటికాల గణేష్, ఆమ్ ఆద్మీ పార్టీ రాష్ట్ర కోర్ కమిటి సభ్యులు డాక్టర్ దిడ్డి సుధాకర్, అన్సారీ, శోభన్‌బాబు, బుర్ర రాముగౌడ్ పాల్గొన్నారు.

# వాడవాడలా ఘనంగా అంబేద్కర్ జయంతి




ఖానాపూర్‌లో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి వేడుకలు జరుపుకుంటున్న పుర ప్రముఖులు, కోకాపేట్‌లో అంబేద్కర్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేస్తున్న కౌన్సిలర్ జి.శివారెడ్డి

**ప్రపంచానికి దారి చూపించిన మార్గదర్శకుడు అంబేద్కర్ : నర్సిహ్మా**

**నార్సింగి..** గండిపేట్ మండలంలోని నార్సింగి, మణి కొండ, బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ల పరిధుల్లో భారత రాజ్యాంగ నిర్మాత బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడు కలు ఘనంగా జరిగాయి. అన్ని పార్టీల రాజకీయ నాయకులు, ప్రజా ప్రతినిధులు, కార్యకర్తలు, అంబేద్కర్ అభిమాన సంఘాల ప్రతినిధులు ఆయన విగ్రహాలకు, చిత్రపటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు.

**ఖానాపూర్‌లో :** ఖానాపూర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి మాజీ ఎంపిపి తలారి మల్లేష్, మాజీ సర్పంచ్ గండయ్య, కౌన్సిలర్ అమరేందర్‌రెడ్డి, కాంగ్రెస్ సీనియర్ నేత పెద్దపులి కృష్ణలతో కలిసి మండల బిఆర్ఎస్ అధ్యక్షులు అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచానికి దారి చూపించిన మార్గదర్శకుడు, దళిత జాతి రత్నం అంబేద్కర్ అని గండిపేట్ మండల బిఆర్ఎస్ అధ్యక్షులు రామేశ్వరం నర్సిహ్మా పేర్కొన్నారు. అణగారిన వర్గాల అభ్యున్నతి కోసం రాజ్యాంగంలో రిజర్వేషన్లను ప్రవేశ పెట్టిన మహనీయుడు అంబేద్కర్ అని కొనియాడారు. దళితులు ఆత్మన్యూనతకు గురి కాకుండా ఆత్మవిశ్వాసంతో ముందుకు రావాల్సిన అవసరం ఉందన్నారు.

**కోకాపేట్‌లో :** కోకాపేట్ చౌరస్తాలో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి కౌన్సిలర్ గంగిడి శివారెడ్డి తన అనుచరగ ణంతో వచ్చి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ చూపిన మార్గంలో పయనించి ప్రజాస్వామ్య విలువలను పెంచుతున్నామన్నారు. సీఎం కేసీఆర్ హైదరాబాద్ నడిబొడ్డున 125.అడుగుల భారీ అంబేద్కర్ విగ్రహాన్ని పెట్టడం చాలా సంతోషంను కలిగిస్తుందన్నారు.

**వివేకానందనగర్‌లో :** వట్టినాగులపల్లి వివేకానందనగర్ కాలనీలో నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ రేఖ యాద గిరి అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లా డుతూ అంబేద్కర్ ఆలోచన విధానం అందరికి ఆదర్శ ప్రాయమన్నారు. దళితుల ఆరాధ్య దైవమైన డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ ఆశయ సాధనకు ప్రతి ఒక్క రూ నడుం బిగించాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో యాదగిరి, సంతోష్, ప్రభు, తిరుపతి, కొండల్‌రెడ్డి, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.

**బండ్లగూడలో :** బండ్లగూడ జాగీర్ కార్పోరేషన్ కార్యాలయంలో మేయర్ మహేందర్‌గౌడ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దళిత జాతి రత్నం బిఆర్. అంబేద్కర్ అని స్పష్టం చేశారు. అంటరానితనంను రూపుమాపేందుకు, అంబేద్కర్ చేసిన పోరాటాలు మరువలేనివన్నారు. అంబేద్కర్ కృషి ఫలి తమే నేడు దళిత సోదరులు స్వేచ్ఛా వాయు వులు పీల్చేందుకు అవకాశం కల్గిందన్నారు. ఈ కార్యక్ర మంలో టీఆర్ఎస్ అధ్యక్షులు సురేష్‌గౌడ్, కార్పొరేటర్లు సాగర్‌గౌడ్, అస్లాం, సీనియర్ నాయకులు పాపయ్య యాదవ్, గోపాల్ ముదిరాజ్, నాగరాజు, మలాకి రత్నం, రాజు నాయక్ పాల్గొన్నారు. అనంతరం ఆర్టీసి బస్సులో రాష్ట్ర సచివాలయం వద్ద సీఎం చేతుల మీదుగా జరిగిన అంబేద్కర్ విగ్రహావిష్కరణకు తరలి వెళ్లారు.

**మణికొండలో :** మణికొండ మర్రిచెట్టు వద్ద ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి నేతృత్వంలో రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరిపారు. ఈ కార్యక్రమంలో బిఆర్ఎస్ అధ్యక్షులు బుద్ధోలు శ్రీరాము లు, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**మైలార్‌దేవ్‌పల్లి డివిజన్‌లో ఘనంగా డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ జయంతి వేడుకలు**

**మైలార్‌దేవ్‌పల్లి..** రాజేంద్రనగర్ సర్కిల్ పరిధిలోని పలు ప్రాంతాలలో శు క్రవారం భారత రాజ్యాంగ నిరా ్మత డాక్టర్.బి.ఆర్.అంబేద ్కర్ జయంతి ఉత్సవాలు ఘనంగా జరిగాయి.కాటేదన్ బిజెపి పార్టీ కార్యాలయంలో డివిజన్ దళిత మోర్చ అధ్యక్షులు కొవ్వకుల బాబు ఆధ్వర్యంలో జరిగిన కార్యాలయంలో మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డితో పాటు బిజెపి నాయ కులు కలిసి డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భారత రాజ్యాంగ నిర్మాత,భారత రత్న డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ దేశానికి చేసిన సేవలు చిరస్మరణీయమన్నారు.రాజేంద్రనగర్ నియోజకవర్గంలోని పలు ప్రాంతాలలో జరిగిన డాక్టర్.బి.ఆర్.అంబేద్కర్ జయంతి ఉత్సవాలలో కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ బాబా సాహెబ్ అంబేద్కర్ జయంతి ఉత్సవ కమిటి సభ్యులు,పార్టీ సీనియర్ నాయకులతో పాటు పలువురు పాల్గొన్నారు.




వివేకానందనగర్ కాలనీలో అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొన్న నార్సింగి మున్సిపల్ చైర్ పర్సన్ రేఖ యాదగిరి, అంబేద్కర్ చిత్ర పటానికి పూల మాలలు వేసి నివాళులు అర్పిస్తున్న మైలార్‌దేవ్‌పల్లి డివిజన్ కార్పొరేటర్ తోకల శ్రీనివాస్‌రెడ్డి,బిజెపి నాయకులు

# బిఆర్ఎస్ ఆత్మీయ సమ్మేళనంకు భారీగా తరలిరండి : రామకృష్ణారెడ్డి

నార్సింగి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త : ఈ నెల 15.వ,తేదీన మధ్యాహ్నం 12.గంటలకు మణికొండ మున్సిపాలిటీలోని సుందర్ గార్డెన్‌లో బీఆర్ఎస్ పార్టీ "ఆత్మీయ సమ్మేళనం" కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందని ఫ్లోర్ లీడర్ కొండకళ్ల రామకృష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమ్మేళనంకు చేవెళ్ల ఎంపి గడ్డం రంజిత్‌రెడ్డి,రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి.ప్రకాశ్‌గౌడ్‌లు ముఖ్య అతిథులుగా హాజరువుతన్నారని వివరించారు. సుమారు మెయ్యి మంది బిఆర్ఎస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఈ సమావేశంలో పాల్గొంటరాని తెలిపారు. పార్టీ నాయ కులు, ప్రజా ప్రతినిదులు, కార్యకర్తలంతా కలిసి ఆత్మీయ సమ్మేళనంలో పాల్గొని పార్టీ పటిష్టత కోసం సూచనలు, సలహాలు, తీర్మాణాలు చేయడం జరుగుతుందన్నారు. ఆత్మీయ సమ్మేళనాలలో బిఆర్ఎస్ సర్కారు చేసిన అభివృద్ధిని ప్రజలలోకి తీసుకెళ్లే మార్గలపై పార్టీ పెద్దలు మనకు దిశానిర్దేశం చేస్తారని పేర్కొన్నారు. నాయకులు, కార్యకర్తలు సైనికుల్లా పని చేయాల్సి న అవసరం ఉందన్నారు. భారీ ఎత్తున బిఆర్ఎస్ ప్రజా ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు తరలి వచ్చి ఆత్మీయ సమ్మేళనంను విజయవంతం చేయాలని రామకృష్ణారెడ్డి కోరారు.

# అంబేద్కర్ సేవలు మరువలేనివి : జంపనప్రతాప్




కంటోన్మెంట్,ఏప్రిల్ 14 ప్రభాతవార్త: భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ అందించిన సేవలు మరువలేనివని కంటోన్మెంట్ బోర్డు మాజీ ఉపాధ్యక్షుడు జంపనప్రతాప్ తెలిపారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని శుక్రవారం బోయిన్‌పల్లి చౌరస్తా, బాపూజీ నగర్, మహాత్మనగర్, కార్ఖాన, చిన్నతోకట్ట, పెద్ద తోకట్ట, బోయిన్‌పల్లి మార్కెట్ ప్రాంతాల్లో ఉన్న అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో నాయకులు ప్రభుకుమార్ గౌడ్, జగదీశ్, అశోక్, రామారావ్ అజిత్, శంకర్, ప్రేమ్ ముదిరాజ్, ఇటుక శ్రీకిషన్ మాదిగ, గౌతమ్ జైన్ తదితరులు పాల్గొన్నారు.

**అంబేద్కర్ సేవలు మరులేనివి : కొంతం దీపిక**

బడుగు బలహీనవర్గాల అభ్యున్నతికి భారత రాజ్యాంగ నిర్మాత బాబాసాహెబ్ అంబేద్కర్ చేసిన సేవలు చిరస్థాయిగా నిలుస్తాయని మోండా డివిజన్ కార్పోరేటర్ కొంతం దీపిక తెలిపారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకొని బిజెపి నేత చిన్న వీరయ్య ఆధ్వర్యంలో 150 డివిజన్ అంబేద్కర్ నగర్‌లో నిర్వహించిన జయంతి వేడుకలకు ఆమె ముఖ్య అతిథిగా హాజరై ప్రసంగించారు. దేశానికి అంబేద్కర్ చేసిన సేవలు కొనియాడారు. ఈ కార్యక్రమంలో బిజెపి సీనియర్ నాయకులు నాయుడు ప్రకాశ్, వీరవర్ధన్ గౌడ్, కొంతం నరేశ్‌కుమార్, బాలమల్లేశ్, గోనె సత్య నారాయణ,రాపోలు మాధురి తదితరులు పాల్గొన్నారు.



చలి వేంద్రాన్ని ప్రారంభిస్తున్న తహసీల్దార్ విజయకుమార్

### చలి వేంద్రాన్ని ప్రారంభించిన తహసీల్దార్

**సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** జిల్లా కేంద్రమైన సంగారెడ్డి పట్టణంలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన చలి వేంద్రాన్ని తహసీల్దార్ విజయకుమార్ శుక్రవారం ప్రారంభించారు. భారత రత్న, భారత రాజ్యాంగ నిర్మాత బిఆర్ అంబేద్కర్ 132వ జయంతిని పురష్కరించుకుని కార్యాల ఆవరణలో చలి వేంద్రాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా తహసీల్దార్ విజయకుమార్ మాట్లాడుతూ కార్యాలయానికి ఆయా ప్రాంతాల నుంచి వచ్చే ప్రజల దాహార్తి తీర్చేందుకు చలి వేంద్రం ఎంతగానే ఉపయోగపడుతుందన్నారు. నాయబ్ తహసీల్దార్ సదత్ అలీ, గిర్దవార్ ప్రవీణ్‌రెడ్డి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

### హైద్రాబాద్ తరలివెళ్లిన నాయకులు



హైదరాబాద్‌లోని అంబేద్కర్ విగ్రహావిష్కరణ కార్యక్రమానికి తలరివెళుతున్న నాయకుల దృశ్యం

**సదాశివపేట, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** హైద్రాబాద్‌లోని ఎన్టీఆర్ గార్డెన్ సమీపంలో డాక్టర్ బిఆర్ అంబేద్కర్ భారీ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో పాల్గొనేందుకు సదాశివపేట నుంచి పెద్ద ఎత్తున నాయకులు, అభిమానులు తరలివెళ్లారు. సంగారెడ్డి మాజీ ఎమ్మెల్యే, జిల్లా బిఆర్‌ఎస్ అధ్యక్షులు, హ్యాండ్లూమ్ డెవలప్‌మెంట్ కార్పోరేషన్ చైర్మన్ చింత ప్రభాకర్ సూచన మేరకు మండల బిఆర్‌ఎస్ ఎస్సీ సెల్ అధ్యక్షులు బేగరి సుధాకర్ ఆధ్వర్యంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఆర్టీసి బస్సులు నాయకులు అంబేద్కర్‌కు, బిఆర్‌ఎస్ ప్రభుత్వానికి, చింత ప్రభాకర్‌కు అనుకూలంగా నినాదాలు చేస్తూ తరలివెళ్లారు. కార్యక్రమంలో మండల బిఆర్‌ఎస్ అధ్యక్షులు పెద్దగొల్ల ఆంజనేయులు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షులు మునిగే నవీన్, ఎంపీఎం నారాయణ, సర్పంచులు కుమార్, యేసయ్య, శ్రీహరి, రమేష్, అశోక్, శేఖర్, సలావుద్దీన్, నగేష్, దశరథ్, నాయకులు తొంట కిష్టయ్య, మాజీ సర్పంచ్ జాన్ సుభాష్, నర్సింలు, ఆత్మకూరు నవీన్, సర్వేశ్వర్ బాలకిషన్, ఇందూరు వీరయ్య, ఏఎన్ఎంలు ఉన్నారు.

### మాజీ చైర్మన్‌ను పరామర్శించిన సిడిసి చైర్మన్



కేతకి ఆలయ మాజీ చైర్మన్‌ను పరామర్శిస్తున్న సిడిసి చైర్మన్ దృశ్యం

**ఝరాసంగం, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** అనారోగ్యానికి గురై చికిత్స అందుకుని విశ్రాంతి తీసుకుంటున్న శ్రీ కేతకి సంగమేశ్వర స్వామి ఆలయ మాజీ చైర్మన్ బసవరాజు పాటిల్‌ను సిడిసి చైర్మన్ ఉమాకాంత్ పాటిల్ పరామర్శించారు. శుక్రవారం బసవరాజు పాటిల్ నివాసానికి బిఆర్‌ఎస్ నాయకులతో ఉమాకంత్ పాటిల్ చేరుకుని బసవరాజ్ పాటిల్ ఆరోగ్య పరిస్థితిని అడగితెలుసుకున్నారు.

### అకాల వర్షాలతో అవస్థలు పడ్డ రైతులను ఆదుకోవాలి
-కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి



అకాల వర్షాలకు దెబ్బతిన్న ఇండ్లను పరిశీలిస్తున్న కాంగ్రెస్ నాయకుల దృశ్యం

**పాపన్నపేట, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** మండలంలోని సోమ్లా, అమ్మయా గిరిజన తండాల్లో గురువారం రాత్రి కురిసిన అకాల వర్షాలకు అవస్థలు పడ్డ రైతులను, ప్రజలను ప్రభుత్వం ఆదుకోవాలని కాంగ్రెస్ పార్టీ కిసాన్ సెల్ జిల్లా అధ్యక్షులు ప్రభాకర్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం పార్టీ అధ్యక్షులు గోవింద్ నాయక్, మండల నాయకులతో కలిసి ఆయా గ్రామాల్లో పర్యటించి ప్రజలను, రైతులను కలిసి నష్టపోయిన వివరాలను అడగితెలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ ఆయా గ్రామాల్లో అకాలంగా కురిసిన వర్షాలతో ఇండ్లు దెబ్బతిన్నాయని, రైతులు సాగు చేస్తున్న పంటలకు నష్టం ఏర్పడిందన్నారు. ఆయా గ్రామాల్లోని వాడలను, సాగవుతున్న పంటలను పరిశీలించామన్నారు. ప్రభుత్వం వెంటనే స్పందించి రైతులకు, ప్రజలను ఆర్థికంగా ఆదుకోవాలని సూచించారు. కార్యక్రమంలో డిసిసి అధికార ప్రతినిధి శ్రీకాంతప్ప, మండల అధ్యక్షులు గోవింద్ నాయక్, ఎంపిటిసి సభ్యులు ఆకుల శ్రీనివాస్, రమేష్‌గౌడ్, సతీష్, ప్రేమ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

### ఊరురా డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి

**దుబ్బాక, ఏప్రిల్ 14, ప్రభాతవాత్త:**

ప్రపంచ మేధావి నవ భారత రాజ్యంగా నిర్మాత డా. బిఆర్ అంబేద్కర్ 132 వ జయంతి సందర్బంగా శుక్రవారం దుబ్బాక పట్టణ పరిధిలో అంబేద్కర్ విగ్రహానికి మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్ రెడ్డి పూల మాల వేసి ఘనంగా నివాళ్ళుఆర్పించారు. అలాగే అక్బర్‌పేటభూంపల్లి మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ దుబ్బాక నియోజకవర్గ ఇంచార్జీ చెరుకు శ్రీనివాస్ రెడ్డి అంబేద్కర్ చిత్రపాటనికి పూలమాల వేసి ఘనంగా నివాళ్ళు అర్పించారు. పట్టణాలతో పాటుగా ప్రతి గ్రామంలో ప్రజా ప్రతినిధులు, అధికారులు అంబేద్కర్ జయంతి వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ అంబేద్కర్ కొదరి వాడు కాదని అంబేద్కర్ అందరి వాడు అని తెలిపారు. అంబేద్కర్ రాసిన రాజ్యంగం ప్రకారమే నేడు పరిపాలన జరుగుతుందన్నారు. అంబేద్కర్ ప్రపంచ మేధావిగా గుర్తింపు పొందారన్నారు. మహనీయుల అడుగుజాడల్లో ప్రతి ఒక్కరు నడుచుకోవాలన్నారు. మున్సిపల్ చైరపర్సన్ గన్నె వనిత భూమి రెడ్డి, కమిషనర్ పాతురి గణేష్ రెడ్డి, ఎంపీపీ కొత్త పుష్పలత కిషన్ రెడ్డి, జడ్పిటిసి కడతాల రవింధర్ రెడ్డి, మండల పార్టీ అధ్యక్షులు, కాంగ్రెస్ నాయకులు, బిఆర్‌ఎస్ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రాహానికి పూలమాల వేస్తున్న దృశ్యం



అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేస్తున్న ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి



అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న ఎమ్మెల్యే మాణిక్‌రావు



అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న పిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్ పులిమామిడి రాజు



అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న టిపిసిసి నేత నరోత్తం

# అంబేద్కర్ ప్రతి ఒక్కరికీ స్ఫూర్తి

## ఘనంగా అంబేద్కర్ జయంతి వేడుకలు

**నారాయణఖేడ్, ఏప్రిల్ 14 ప్రభాతవార్త:** అంబేద్కర్‌ను ప్రతి ఒక్కరు స్ఫూర్తిగా తీసుకోవాలని ఎమ్మెల్యే ఎం. భూపాల్‌రెడ్డి అన్నారు. శుక్రవారం ఖేడ్ పట్టణంలో అంబేద్కర్ జయంతి వేడుకల సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు ఆరిపించారు. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరం కెవిపిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేశారు. శుక్రవారం ఎమ్మెల్యే భూపాల్‌రెడ్డి చేతుల మీదుగా ఖేడ్ ఏరియా ప్రభుత్వ ఆసుపత్రిలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. రక్తదానం చేసిన వారికి ఎమ్మెల్యే ఎం.భూపాల్‌రెడ్డి చేతుల మీదుగా సర్టిఫికెట్లను అందజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రుబినాబేగం నజీబ్, వైస్ చైర్మన్ పరశురాం, ఎ.ఎంసీ వైస్ చైర్మన్ విజయ్ బుజ్జీ, పెద్దశంకరంపేట జడ్పీటీసీ విజయరామరావు, నాయకులు రమేష్ చౌహన్, రవీందర్‌నాయక్, అభిషేక్ శెట్కార్, రామకృష్ణ, నారాయణఖేడ్ నియోజకవర్గ బిఆర్‌ఎస్ వి అధ్యక్షులు అంజాగౌడ్ తదితరులు పాల్గొన్నారు.

**ఖేడ్‌లో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో..** నారాయణఖేడ్ పట్టణంలో టీపీటీఎఫ్ ఆధ్వర్యంలో అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అరిపించారు. ఎస్‌ఐ. వెంకట్‌రెడ్డి, నాగారాం శ్రీనివాస్ టీపీటీఎఫ్ జిల్లా నాయకులు, పాండురంగారెడ్డి సంగారెడ్డి జిల్లా ఉపాధ్యక్షులు, బాబురావు,శేరికార్ రమేష్,కిషన్‌రావు, ప్రభాకర్‌రావు,



అంబేద్వకర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న కాంగ్రెస్ నాయకుల దృశ్యం

పరశురాం రాథోడ్‌వెంకట్ పాల్గొన్నారు.

**కల్హేర్‌లో..**

కల్హేర్‌తో పాటు ఆయా గ్రామాల్లో అంబేద్కర్ 132వ జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఆట పాటలతో వచ్చి అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్ళులు అరిపించారు. కల్హేర్‌లో ఎంపీపీ అధ్యక్షురాలు సుశీలమ్మ, జడ్పీటీసీ సభ్యులు నర్సింహారెడ్డి, కో ఆప్షన్ మెంబర్ డాక్టరు అలీసాబ్ అంబేద్కర్ చిత్రపటానికి పూలమాలలు వేసి జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించారు. గ్రామ సర్పంచ్ లచ్చమ్మ బాలయ్య,ఉప సర్పంచ్ సాయిలు, బాబురావు, ఎం.ఎ. ఘనీ, దళిత సంఘాల నాయకులు తదితరులు పాల్గొన్నారు.

**బుసారెడ్డిపల్లిలో ..**

**మునిపల్లి, ఏప్రిల్ 14 ప్రభాతవార్త:**

డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి సందర్భంగా మునిపల్లి మండల పరిధిలోగల బుసారెడ్డిపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించడం జరిగింది. అంబేద్కర్ ఆశయసాధన కోసం అందరూ కంకణబద్దులైన ముందుకు నడవాలని, కులవివక్షత లేకుండా సమాజయంలో అందరూ సమానంగా జీవించే విధంగా ప్రతి ఒక్కరూ కృషి చేయాలని అందే అంబేద్కర్‌కు మనం ఇచ్చే నిజమైన నివాళి అన్నారు. బిఆర్‌ఎస్ పార్టీ మునిపల్లి మండల ప్రధాన కార్యదర్శి శశికుమార్ ఉపసర్పంచ్ రమేష్, మాజీ సర్పంచ్ నర్సింలు, ఇంద్రరెడ్డి పటేల్ మొగులయ్య వెంకటేశం, కీర్తి నాగరాజు, విట్టల్, రాజు, కార్తీక్ తదితరులు పాల్గొన్నారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి ౹ కుమార్ పాల్గొన్నారు.

**ముకుందా నాయక్ తండాలో..**

**కంగ్టి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని ముకుందా నాయక్ తండాలోని పంచాయితీ కార్యాలయంలో గ్రామ సర్పంచ్ సురేఖ వెంకట్ రాథోడ్



పట్టణంలో అంబేద్కర్ శోభాయాత్ర నిర్వహిస్తున్న దృశ్యంల

ఆధ్వర్యంలో జయంతి వేడుకలను పురష్కరించుకుని ప్రత్యేంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ చిత్ర పటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. ఎల్‌హెచ్‌పిఎస్ నియోజకవర్గ అధ్యక్షులు శ్రీను రాథోడ్, తండా ఉప సర్పంచ్ చాంగున బాయి, వార్డు సభ్యులు, తండా వాసులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

**ఝరాసంగంలో..**

**ఝరాసంగం, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఝరాసంగంలో అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నాయకులు, ప్రజాప్రతినిధులు, అభిమానులు ఘన నివాళులు అర్పించారు. మండల సర్పంచ్‌ల ఫోరం అధ్యక్షులు, ఝరాసంగం సర్పంచ్ బొగ్గుల జగదీశ్వర్, జిల్లా యువజన కాంగ్రెస్ అధ్యక్షులు ఉదయ్ శంకర్ పాటిల్, శ్రీ కేతకి ఆలయ కమిటి సభ్యులు సజ్జనార్ నాగేష్, ఎంపి నాగేష్, మాజీ సర్పంచ్ పెంటప్ప, ఉప సర్పంచ్ సంగన్న, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు శివకుమార్, ప్రదీప్, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

**మనూర్‌లో..**

**మనూర్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** ప్రపంచ వేధావి, నవ భారత నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి వేడుకలను శుక్రవారం మండలంలోని ఆయా గ్రామాల్లో ఘనంగా జరుపుకున్నారు. మనూర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి అధికారులు, నాయకులు, ప్రజాప్రతినిధులు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎస్‌ఐ లక్ష్మణ్, మనూర్ సర్పంచ్ శివాజీరావు, బిఆర్‌ఎస్ మండల అధ్యక్షులు విఠల్‌రావు, వివేకానంద సేవా సమితి అధ్యక్షులు సిద్దరెడ్డి, బాధ్యులు పండరి, నగేష్, బెల్లాపూర్ ఎంపిటిసి సభ్యులు రాజశేఖర్‌రెడ్డి, పంచాయితీ కార్యదర్శి శ్రీనివాసన తదితరులు పాల్గొన్నారు.

**అంబేద్కర్‌కు పిఎంఆర్ చైర్మన్ ఘన నివాళులు**

భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతిని పురష్కరించుకుని పిఎంఆర్ ఫౌండేషన్ చైర్మన్, బిఆర్‌ఎస్ రాష్ట్ర నాయకులు పులిమిమిడి రాజు శుక్రవారం ఘన నివాళులు అర్పించారు.

**జహీరాబాద్‌లో..**



మనూర్‌లో అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

**జహీరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** భారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్నం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. పట్టణంలోని జాతీయ రహదారిపై ఉన్న అంబేద్కర్ విగ్రమానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ జి మాల్లారెడ్డి, మాజీ మున్సిపల్ చైర్మన్‌లు మంకాల్ సుభాష్, అల్లాడి నర్సింలు, మురళీక్రిష్ణ గౌడ్, ముత్యాల చందు, బిఆర్‌ఎస్ నాయకులు గుండప్పు, ఇజ్రాయిల్ బాబి, మిథున్‌రాజ్, జయరాజ్ తదితరులు పాల్గొన్నారు.

**కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో..**

శుక్రవారం పట్టణంలో అంబేద్కర్ జయంతి వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యక్షులు గిరిధర్‌రెడ్డి, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు కండెం నర్సింలు, మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు పి నరసింహారెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

**దళిత సంఘాల ఆధ్వర్యంలో...**

అంబేద్కర్ ఉత్సవ కమిటి ,అంబేద్కర్ యువజన సంఘం, బుడగజంగాలు, ముదిరాజ్ సంఘాలతో పాటు ఆయా కుల సంఘాల ఆధ్వర్యంలో నాయకులు అంబేద్కర్ జయంతిని ఘనంగా జరుపుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. కార్యక్రమంలో ఉత్సమ కమిటి కన్వీనర్ గౌతం రామచందర్ భీంవంశీ, డి శ్రీనివాస్, జయరాజ్, నర్సింలు, పిచ్చయ్య, నరసయ్య తదితరులు పాల్గొన్నారు. అంబే ద్కర్ కమిటి ఆధ్వర్యంలో పట్టణంలోని అంబేద్కర్ విగ్ర హం నుంచి విద్యుత్ సబ్‌స్టేషన్ వద్ద గల అంబేద్కర్ భవనం వరకు భారీ శోభయాత్ర ర్యాలీ నిర్వహించారు.

**అంబేద్కర్‌కు నివాళులు అర్పించిన నరోత్తం**

భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతిని పురష్కరించుకుని టిపిసిసి నేత వై నరోత్తం



కంగ్టిలో అంబేద్కర్ సర్కిల్‌లో అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

శుక్రవారం అంబేద్కర్‌కు ఘన నివాళులు అర్పించారు. పట్టణంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో మండల కాంగ్రెస్ పార్టీ ఉపాధ్యక్షులు పి నాగిశెట్టి, యూత్ కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి రాజు నాయక్, నాయకులు మహ్మద్ యూసుఫ్, సిహెచ్ శ్రీనివాస్, బాలచందర్, మహ్మద్ అనీఫ్, రాజు, పిజి ఈశ్వర్, బాల్‌రాజ్, షరీఫ్, శ్రీకాంత్, అమిన్, సునీల్ కుమార్, సమ్మప్ప, తుల్జారాం, మైపాల్‌రెడ్డి, ప్రకాశ్, చెంగల్ జైపాల్, విఠల్, పెంటన్న తదితరులు ఉన్నారు.

**న్యాల్‌కల్ మండలంలో ..**

**న్యాల్‌కల్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** బారత రాజ్యాంగ నిర్మాత, భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి వేడుకలను శుక్రవారం ప్రజాప్రతినిధులు, అధికారులు దళిత సంఘాల నాయకులు, అభిమానులు ఘనంగా జరుపుకున్నారు. అంబేద్కర్ విగ్రహాలకు, చిత్ర పటలకు పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాల్లో తహసీల్దార్, ఎంపిడిఓ, ఆయా గ్రామాల సర్పంచ్‌లు, ఎంపిటిసి సభ్యులు, పంచాయితీ కార్యదర్శులు, వార్డు సభ్యులు, నాయకులు పాల్గొన్నారు.

**బిఎస్పీ ఆధ్వర్యంలో...**

బిఎస్‌పి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సిద్దు రావణన ఆధ్వర్యంలో శుక్రవారం అంబేద్కర్ జయంతి వేడుకలను నాయకులు ఘనంగా జరుపుకున్నారు. అంబేద్కర్ విగ్రహానికి సిద్దు రావణ్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బిఎస్‌పి నాయకులు బాబురావు, అసెంబ్లి కార్యదర్శి రాహుల్, న్యాల్‌కల్ మండల అధ్యక్షులు సంగ్రామ్, ఉపాధ్యక్షులు అరుణ్, టేకూర్ గ్రామ అధ్యక్షులు శ్రీకాంత్, నాయకులు కృష్ణ, నర్సింలు, రాచన్న, శ్రీశైలం, యాదగిరి, అశోక్, రవి పాల్గొన్నారు.

**హత్నూర మండలంలో ..**

**హత్నూర ఏప్రిల్ 14,ప్రభాతవార్త:** భరతరత్న బిఆర్‌అంబేద్కర్ జయంతిని శుక్రవారం హత్నూర మండలంలో ఘనంగా జరుపుకున్నారు. మండలంలోని హత్నూర, దౌల్తాబాద్, నాగుల్‌దేవులపల్లి, గోవింద్‌రాజ్‌పల్లి, సిరిపురం, కాసాల,నస్తీపూర్, తుర్కలఖనాపూర్, మంగాపూర్, గుండ్లమాచునూర్, మల్కా పూర్, బోర్పట్ల, కొన్యాల, నవాబుపేట, దేవులపల్లి, చింత్ చేరువు, చందాపూర్, లింగాపూర్ తదితర గ్రామాలతో పాటు హత్నూర మండల ప్రజాపరిషత్ కార్యాలయంలో అంబే ద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా నిర్వహించారు. ఆయా గ్రామాలలోని విగ్రహలకు,చిత్రపటాలకు పూలమా లలు వేసి నివాళులు



కందిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న సర్పంచ్ విమల దృశ్యం

అర్పించారు. దేవులపల్లి గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేయనున్న అంబేద్కర్ విగ్రహం ఏర్పాటుకు భూమీ పూజను నిర్వహించారు. దేవులపల్లి గ్రామానికి చెందిన బిఆర్‌ఎస్ జిల్లా నాయకులు వీరేశంగౌడ్ పాల్గోని భూమీ పూజ చేశారు. హత్నూరలోని అంబేద్కర్ గురుకుల కళాశాలలో ప్రిన్సిపల్ వివేకానందా ఆధ్వర్యంలో కళాశాలలో అంబేద్కర్ జయంతి వేడుకలను నిర్వహిం చారు. కళాశాల భోదనసిబ్బంది,విధ్యార్థులు పాల్గొన్నారు.

**కొండాపూర్‌లో..**

**కొండాపూర్ ఏప్రిల్ 14,ప్రభాతవార్త:** కొండాపూర్ మండలంలో భారతరత్నా భిఆర్ అంబేద్కర్ జయంతి వేడుకలు శుక్రవారం ఘనంగా జరిగాయి.మండలంలోని వివిధ గ్రామాలలోని అంబేద్కర విత్రహాలకు,చిత్రపటాలకు పూలమాలలువేసి నివాళులు ఆర్పించారు. మండలంలోని మల్కాపూర్ గ్రామంలో అంబేద్కర్ యూత్ అధ్వర్యంలో జరిగిన జయంతి వేడుకలలో సర్పంచ్ కొత్తకాపు భాగ్యవ తిమల్లారెడ్డి పాల్గోన్నారు. ఈసందర్బంగా అమే అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు ఆర్పించారు.

**నాగల్‌గిద్ద మండలంలో ...**

**నాగల్‌గిద్ద, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి వేడుకలను అధికారులు, ప్రజాప్రతినిధులు, నాయకులు, అంబేద్కర్ యువజన సంఘాల నాయకులు ఘనంగా జరుపుకున్నారు. మండల పరిధిలోని కరస్‌గుత్తి, వల్లూర్, గూడూర్ తదితర గ్రామాల్లో అంబేద్కర్ విగ్రహాలకు, చిత్ర పటాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. మండలంలోని ఆయా గ్రామ పంచాయితీ కార్యాలయాల్లో అంబేద్కర్ చిత్ర పటాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి నివాళులు అర్పించారు.

**కంగ్టిలో ..**

**కంగ్టి, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కంగ్టిలో శుక్రవారం బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి



తాళ్లపల్లిలో అంబేద్కర్‌కు నివాళులు అర్పిస్తున్న దృశ్యం

వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. అంబేద్కర్ చిత్ర పటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. అంబేద్కర్ జయంతిని పురష్కరించుకుని ఏర్పాటు చేసిన కార్యక్రమం ఆటపాటలతో ఆనందోత్సల మధ్య పూర్తయింది. కార్యక్రమానికి చేరుకున్న వారికి అన్నదానం వితరణ చేశారు. కార్యక్రమంలో ఎంపిపి అధ్యలు సంగీత వెంకట్‌రెడ్డి, ఎస్ఐ సత్యనారాయణ, అంబేద్కర్ యువజన సంఘం నాయకులు, ఎల్‌హెచ్‌ఆర్ఎసన రాష్ట్ర నాయకులు ప్రకాష్ రాథోడ్, సర్పంచ్ రాథోడ్ సురేఖ వెంకట్, వైఎస్‌ఆర్‌టిపి ప్రధాన కార్యదర్శి బోర్గి సంజీవ్, బిఆర్‌ఎస్ నాయకులు క్రిష్ణ, కెవిపిఎస్ మండల అధ్యక్షులు రాహుల్, బిఎస్‌పి మండల అధ్యక్షులు సాయిలు, రాజు తదితరులు పాల్గొన్నారు.

**అంబేద్కర్ అడుగుజాడల్లో పయనించాలి**

**పాపన్నపేట, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** భారత రత్న డాక్టర్ బిఆర్ అంబేద్కర్ దేశం గర్వించదగ్గ మేధావుల్లో అగ్రగణ్యులని డాక్టర్ రోహిత్ అభివర్ణించారు. శుక్రవారం మండల పరిధిలోని మల్లంపేట గ్రామంలో నూతనంగా ఏర్పాటు చేసిన అంబేద్కర్ విగ్రహాన్ని ప్రజల హర్షధ్వానాల మధ్య డాక్టర్ రోహిత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ రోహిత్ మాట్లాడుతూ సామాజికంగా, రాజకీయంగా, ఆర్థికంగా, ఆధ్యాత్మికంగా అన్ని రంగాల్లో అంబేద్కర్‌కు అపార జ్ఞానం ఉందన్నారు. అంబేద్కర్ సూచించిన, నడిచిన బాటలో ప్రతి వ్యక్తి పయనించాల్సిన అవసరం ఉందని గుర్తు చేశారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ బాపురెడ్డి, అసిస్టెంట్ ప్రొఫెసర్ రామస్వామి,ఇ నరేందర్, నాగరాజు, సంఘం అధ్యక్షులు కేశవులు, నర్పంచులు సుదర్శన్, విఠల్, బుజ్జి ఆశయ్య, నాయకులు త్యార్ల రమేష్, షాహిద్ పాషా, నరేందర్, జనప్రియ, బాలాగౌడ్, బలరాం, బాలయ్య, రాజయ్య, సాయిలు, రమేష్, నర్సింలు, చంద్రయ్య తదితరులు పాల్గొన్నారు.

**గ్రామ గ్రామానా అంబేద్కర్ జయంతి వేడుకలు**

మండలంలోని ఆయా గ్రామాల్లో శుక్రవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి వేడుకలను ప్రజాప్రతినిధులు, అధికారులు, నాయకులు, అంబేద్కర్ యువజన సంఘాల ఆధ్వర్యంలో ఘనంగా జరుపుకున్నారు. గ్రామాల్లోని అంబేద్కర్ విగ్రహాలకు, ప్రభుత్వ కార్యాలయాల్లో అంబేద్కర్ చిత్ర పటాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు.

**పట్టణంలో అంబేద్కర్ శోభాయాత్ర**

**జహీరాబాద్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** డాక్టర్ బిఆర్



దేవులపల్లిలో అంబేద్కర్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

అంబేద్కర్ 132వ జయంతిని పురష్కరించుకుని నియోజకవర్గ కేంద్రమైన జహీరాబాద్ పట్టణంలో సాయంత్రం భారీ శోభాయాత్ర నిర్వహించారు. అందంగా అలంకరించిన వాహనంలో అంబేద్కర్ చిత్ర పటానికి ఏర్పాటు చేసుకుని పట్టణంలోని జాతీయ రహదారిపై యువత నృత్యాలు చేస్తూ, కోలాటలు ఆడుతూ, ఆటపాటలు ఆలపిస్తూ నిర్వహించిన శోభాయాత్ర ఆకట్టుకుంది. పట్టణంలోని జాతీయ రహదారిపై గల అంబేద్కర్ విగ్రమానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి ప్రారంభించిన ర్యాలీ పట్టణంలోని విద్యుత్ సబ్ స్టేషన్ ఎదురుగా గల అంబేద్కర్ భవన్ వరకు ఉత్సాహం ర్యాలీ కొనసాగింది. జహీరాబాద్ డివిజన్ పరిధిలోని ఆయా మండలాల్లోని గ్రామాల నుంచి అంబేద్కర్ అభిమానులు, ఆయా కుల సంఘాలు, అంబేద్కర్ సంఘాల నాయకులు పెద్ద సంఖ్యలో చేరుకుని ర్యాలీలో పాల్గొన్నారరు. కార్యక్రమం అంబేద్కర్ ఉత్సవ కమిటి కన్వీనర్ మొగులయ్య గౌదం, బాధ్యులు డి శ్రీనివాస్, జయరాజ్, వెంకటేష్, బిచ్చయ్య, అందజయ్య, అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.

**తాళ్లపల్లిలో...**

**సంగారెడ్డి టౌన్, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** మండలంలోని తాళ్లపల్లి గ్రామంలో శుక్రవారం డాక్టర్ బిఆర్ అంబేద్కర్ 132వ జయంతి వేడుకలను శుక్రవారం ఘనంగా జరుపుకున్నారు. అంబేద్కర్ చిత్ర పటానికి పూజా కార్యక్రమాలు నిర్వహించి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ ఏ ప్రవీణ్‌కుమార్, అంబేద్కర్ యూత్ సభ్యులు, గ్రామ ఉప సర్పంచ్, వార్డు సభ్యులు, అంబేద్కర్ అభిమానులు పాల్గొన్నారు.

**కందిలో అంబేద్కర్‌కు నివాళులు అర్పించిన సర్పంచ్**

**కంది, ఏప్రిల్ 14, ప్రభాతవార్త:** మండల కేంద్రమైన కందిలో శుక్రవారం గ్రామ సర్పంచ్ విమల వీరేశం భారత రాజ్యాంగ నిర్మాణ, భారత రత్న, బడుగు బలహీన వ



మల్లంపేటలో అంబేద్కర్ విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న డాక్టర్ రోహిత్

ర్గాల ఆశాజ్యోతి డాక్టర్ బిఆర్ అంబేద్కర్‌కు ఘనంగా నివాళులు అర్పించారు. శుక్రవారం అంబేద్కర్ 132వ జయంతిని పురష్కరించుకుని గ్రామ చౌరస్తాలోని అంబేద్కర్ విగ్రాహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. కార్యక్రమంలో బిఆర్‌ఎస్ నాయకులు పాల్గొన్నారు. ఇదిలా ఉండగా మండలంలోని ఆయా గ్రామాల్లో అంబేద్కర్ జయంతి ఉత్సవాలను ఘనంగా జరుపుకున్నారు. ఆయా గ్రామాల్లోని పంచాయితీ కార్యాలయాల్లో అంబేద్కర్ చిత్ర పటాలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి ఘనంగా నివాళులు అర్పించారు. ఆయా కార్యక్రమాలో అధికారులు, ప్రజప్రతినిధులు, నాయకులు, అంబేద్కర్ అభిమానులు, అంబేద్కర్ సంఘాల నాయకులు పాల్గొన్నారు.